# బీజేపీ, కాంగ్రెస్ చీకటి దోస్తులు

- బండి గెలుపు కోసమే కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థి
- ప్రభుత్వంపై రైతుల గుస్సా
- కేసీఆర్‌నే కాంక్షిస్తున్న ప్రజలు
- సిరిసిల్లలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో క్లస్టర్‌స్థాయి సమావేశంలో కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): 'బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చీకటి దోస్తులు. బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌ను గెలిపించేందుకు కరీంనగర్‌లో కాంగ్రెస్ పార్టీ డమ్మీ అభ్యర్థిని నిలబెట్టింది. బండి మత రాజకీయాలు తప్ప అభివృద్ధి మాట ఎత్తడు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు మండిపడ్డారు. వంద రోజుల్లో హామీలన్నీ నెరవేరుస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు ఇన్ని రోజులు అయినా హామీలు అమలుచేయకపోవడంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. కేసీఆర్ పాలనకు, ఈ ప్రభుత్వ పాలనకు తేడాను ప్రజలు తెలుసుకున్నారు. రైతులు ప్రభుత్వంపై తిరుగుబాటుకు సిద్ధమయ్యారు' అని పేర్కొన్నారు. బుధవారం సిరిసిల్లలోని తెలంగాణభవన్‌లో సిరిసిల్ల నియోజకవర్గంలోని వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల క్లస్టర్ స్థాయి పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో దేశానికే ఆదర్శంగా తెలంగాణలో అభివృద్ధి చేసుకున్నామని, వ్యవసాయాన్ని పండుగలా మార్చుకున్నామని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతి ఇంటికి ప్రభుత్వ ఫలాలు అందాయని, బీఆర్ఎస్‌కు ప్రజల్లో ఆదరణ ఉందని, గత అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ పార్టీకి ఓటు వేయలేదని ప్రజలు బాధపడుతున్నారని చెప్పారు. తెలంగాణ ప్రజల కోసం కేసీఆర్ ప్రజల్లోకి వస్తున్నారని కేటీఆర్ చెప్పారు. తెలంగాణవ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి బయలు దేరారని తెలిపారు. రోడ్‌షోలో తమ నాయకుడిని చూసి రైతులు, ప్రజలు నేరుగా కలిసి తమ బాధలు చెప్పుకుంటున్నారని పేర్కొన్నారు. 'మళ్లీ కేసీఆర్' రావాలంటూ తమ ఆకాంక్షను తెలుపుతున్నారని చెప్పారు. బీఆర్ఎస్ అత్యధిక సీట్లు గెలుచుకుంటుందని సర్వేలు చెప్తున్నాయని, ప్రతి కార్యకర్త రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి పార్టీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. అధికారంలో ఉన్నపుడు లబ్ధిపొందిన కొందరు నాయకులు కష్టకాలంలో కేసీఆర్‌ను వీడిపోతున్నారని మండిపడ్డారు. గ్రామీణ స్థాయిలో చురుకైన కార్యకర్తలను తయారు చేసుకుందామని పిలుపునిచ్చారు. పనిచేసే ప్రతి కార్యకర్తకు తాను వెన్నంటి ఉంటానని భరోసా ఇచ్చారు. సమావేశంలో టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగారావు, జడ్పీటీసీ సభ్యుడు చీటి లక్ష్మణ్‌రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంత్రి సురేఖపై ఫిర్యాదు విచారణలో..

- దాసోజు కేసులో హైకోర్టుకు నివేదించిన ఈసీ

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి కొండాసురేఖ వ్యాఖ్యలపై ఈసీ చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ ఫిర్యాదుపై విచారణ జరుగుతున్నదని కేంద్ర ఎన్నికల సంఘం హైకోర్టుకు నివేదించింది. ఫిర్యాదుపై విచారణ పూర్తి చేసి ఈ నెల 26లోగా తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చింది. ఈసీ వివరణతో సంతృప్తి చెందిన హైకోర్టు దాసోజు పిటిషన్‌పై విచారణను ముగించింది. కేటీఆర్‌కు పరువు నష్టం కలిగేలా సురేఖ ప్రెస్‌మీట్‌లో వ్యక్తిగత అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఫోన్ ట్యాపింగ్ కేసుతో కేటీఆర్‌కు ఎలాంటి ప్రమేయం లేకపోయినా తీవ్ర ఆరోపణలు చేసిన మంత్రిపై చర్యలు తీసుకోవాలన్న ఫిర్యాదుపై ఈసీ స్పందించలేదని దాసోజు హైకోర్టును ఆశ్రయించారు. మంత్రిపై చర్యలు తీసుకునేలా ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలని కోరారు. ఈ వ్యాజ్యాన్ని బుధవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనల సందర్భంగా ఈసీ వివరణతో సంతృప్తిని వ్యక్తం చేసి విచారణను ముగించింది.

# కాంగ్రెస్‌కు ఓటేసి వృథా చేసుకోవద్దు

- బీజేపీని ఓడించే దమ్ములేని కాంగ్రెస్
- రాహుల్ కేరళ నుంచి పోటీ అందుకే
- ఎన్డీఏ కూటమికి 200 సీట్లు దాటవు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



తూముకుంటలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో బీఆర్ఎస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, వివేకానంద

మేడ్చల్, ఏప్రిల్ 24(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌కు బీజేపీని ఓడించే దమ్ములేదని, ఆ పార్టీకి ఓటేసి ఓటును వృథా చేసుకోవద్దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా తూముకుంట మున్సిపాలిటీ పరిధిలో మల్కాజిగిరి పార్లమెంటు అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్ సందర్భంగా బుధవారం ఏర్పాటుచేసిన సభలో కేటీఆర్ మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని కొందరు ప్రచారం చేస్తున్నారని, కానీ 2014, 2019లో బీజేపీని అడ్డుకున్నది ఒక్క బీఆర్ఎస్ మాత్రమేనని గుర్తుచేశారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనన్న ప్రచారాన్ని మైనార్టీలు నమ్మవద్దని, అదే నిజమైతే కవిత జైలులో ఉండేవారా? అని ప్రశ్నించారు. బీజేపీని ఓడించే దమ్ము లేకపోవడం వల్లే రాహుల్‌గాంధీ కేరళ నుంచి పోటీచేస్తున్నారని ఎద్దేవా చేశారు.

### బీఆర్ఎస్ గెలిస్తేనే పథకాలు

కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలుకావాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలని కేటీఆర్ కోరారు. కాంగ్రెస్‌కు మళ్లీ ఓటు వేస్తే మొత్తం పథకాలు బంద్ అవుతాయని అనుమానం వ్యక్తంచేశారు. అందరం కలిసికట్టుగా పనిచేసి మళ్లీ కేసీఆర్ చుట్టూ రాజకీయాలు తిరిగే పరిస్థితి తీసుకువద్దామని పిలుపునిచ్చారు. బీజేపీని అడ్డుకునే దమ్ము ఒక్క కేసీఆర్‌కే ఉందని, ఈ ఎన్నికల్లో ఎన్డీయేకు 200 సీట్లు, ఇండియా కూటమికి 150 సీట్లు దాటవని జోస్యం చెప్పారు. 400 సీట్లలో గెలుస్తామంటూ మోదీది బిల్డప్ మాత్రమేనని ఎద్దేవా చేశారు. గెలవరని అర్థమైంది కాబట్టే ముస్లింపై ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఉప్పు, పప్పు, చింతపండు, బస్సు, రైలు టికెట్ ధరలు పెంచారని, అందుకనే మోదీని అందరూ 'ప్రియమైన'మోదీ అంటారని ఎద్దేవా చేశారు.

### రాష్ట్రం ఆగమైంది

కేసీఆర్ లేక రాష్ట్రం ఆగమైందని ప్రజలు చర్చించుకుంటున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్‌ను పది స్థానాల్లో గెలిపిస్తే కేసీఆర్ మళ్లీ తెలంగాణ గొంతుక అవుతారని తెలిపారు. కార్యక్రమంలో మాజీమంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, కేపీ వివేకానంద్, సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, సురభి వాణీదేవి, మల్కాజిగిరి బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఫ్లోరైడ్ రిసెర్చ్ సెంటర్ తెస్తా..

కేంద్రం మెడలు వంచి సాధిస్తా.. • సెంటర్‌తో నల్లగొండకు ఎంతోమేలు • భువనగిరికి ఐటీ కారిడార్ తెస్తా • ఐఐహెచ్‌టీ కోసం కొట్లాడుతా

గుట్ట, ఇబ్రహీంపట్నానికి మెట్రో • చిట్యాలలో డ్రైపోర్ట్, బీబీనగర్‌లో సీసీఎంబీకి కృషి • ఎన్‌హెచ్‌లను ఆరులేన్లుగా మారుస్తాం

జాతీయ పార్టీతో ఒరిగేదేం లేదు • 80 లక్షల ఓటర్లున్న మాదిగలకు ఒక్క ఎంపీ సీటివ్వరా? • బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్



నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూ

యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ) : 'చౌటుప్పల్‌కు ఫ్లోరైడ్ రిసెర్చ్ సెంటర్‌ను కేంద్రం ఇచ్చినట్టే ఇచ్చి తన్నుకుపోయింది. ప్రపంచంలోనే అత్యధిక శాతం ఫ్లోరైడ్ ప్రభావం ఉన్న ఉమ్మడి నల్లగొండపై కేంద్రం చిన్నచూపు చూస్తున్నది. ఈ ప్రాంత ప్రజల శ్రేయస్సు కోసం కేంద్రం మెడలు వంచైనా మునుగోడుకు ఫ్లోరైడ్ రిసెర్చ్ సెంటర్ తీసుకొస్తా..' అని బీఆర్ఎస్ భువనగిరి లోక్‌సభ అభ్యర్థి క్యామ మల్లేశ్ చెప్పారు. మంగళవారం 'నమస్తే తెలంగాణ'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ముందుచూపుతోనే పదేండ్లలో ఒక్క ఫ్లోరైడ్ కేసు కూడా నమోదు కాలేదని గుర్తుచేశారు.

**జాతీయ పార్టీలతోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్, బీజేపీ అంటున్నయ్ కదా?**

అందులో వాస్తవం లేదు. జాతీయ పార్టీలకు రాజకీయ ప్రయోజనాలు తప్ప రాష్ట్రాల ప్రయోజనాలు పట్టవు. ఆయా పార్టీల్లో ఎవరు ప్రముఖ నేతలు ఉంటే వారి రాష్ట్రాలకే ఎక్కువ నిధులు వెళ్తాయి. కేవలం ఇద్దరు ఎంపీలున్నప్పుడు మనం తెలంగాణను సాధించినం. ఇప్పటివరకు పార్లమెంట్‌లో తెలంగాణ హక్కుల కోసం కొట్లాడింది బీఆర్ఎస్ ఎంపీలేననే విషయాన్ని మరిచిపోవద్దు. బీఆర్ఎస్ ఎంపీలకే తెలంగాణ సోయి ఉంటుంది.

**పార్లమెంట్ ఎన్నికలు కాంగ్రెస్ పాలనకు రెఫరెండమన్న సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై మీరేమంటారు?**

అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ ఎగదోపిండు. రైతు రుణమాఫీ, ధాన్యానికి రూ. 500బోనస్, రైతు బంధు, ఆడబిడ్డల పెండ్లికి తులం బంగారం, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ. 2500, పింఛన్ల పెంపు ఇలా చెప్పుకొంటూ పోతే చాంతాడంత హామీల జాబితా ఉన్నా ఒక్కటీ నెరవేర్చలేదు. ప్రజల్లోకి వెళ్తే కాంగ్రెస్‌ను బూతులు తిడుతున్నారు. ఆరు గ్యారెంటీలను అమలుచెయ్యి అంటే రేవంత్‌రెడ్డి దేవుడ్లమీద ప్రమాణం చేస్తున్నడు. ప్రజలను మోసం చేసుడుతప్ప కాంగ్రెస్ ఏం చేసిందని ఈ ఎన్నికలను రెఫరెండంలా తీసుకుంటరు? బడుగులకు వ్యతిరేకంగా సీఎం రేవంత్‌రెడ్డి ముందుకుపోతున్నడు. తెలంగాణలో 80లక్షల ఓటర్లున్న మాదిగలకు ఒక్క ఎంపీ సీటు కూడా కేటాయించలేదు. గొల్లకురుమలు, గౌడ్‌లకు కూడా టికెట్ ఇవ్వలేదు. ఆయా వర్గాల్లో కాంగ్రెస్‌పై పీకలదాకా కోపం ఉంది.

**రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ చేస్తున్న ప్రచారంపై మీ అభిప్రాయం?**

రాజ్యాంగాన్ని మారిస్తే దేశ ప్రజలు ఊరుకోరు. కర్రు కాల్చి వాతపెడుతరు. బీజేపీ కేవలం మత, కుల రాజకీయాలతోనే బతుకుతున్నది. పుల్వామా, రామమందిరం, ఇప్పుడు రాజ్యాంగం అంటూ రాజకీయాలు చేస్తున్నది. ఆ పార్టీ పదేండ్లు అధికారంలో ఉండి రాష్ట్రానికి, దేశానికి ఏం చేసిందో చెప్పుకోలేని దుస్థితి. దేశంలో దాదాపు 140 కోట్ల మంది ఉంటే, 40 కోట్ల మందికి తినడానికి తిండి లేదు. విద్య, వైద్యం అందుతలేదు. దేశంలో 40 శాతం ప్రాంతాలకు రోడ్డు కనెక్టివిటీ లేదు. విద్యుత్తు సదుపాయం, సాగునీరు సరిపడా లేదు. ఇంకా 20శాతం జనాభా దారిద్ర్యరేఖకు దిగువన బతుకుతున్నది. బీజేపీ గెలిస్తే స్థానిక సమస్యలు, తెలంగాణను పట్టించుకునే పరిస్థితి ఉండదు. గత ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే ఏం అభివృద్ధి జరిగిందో అందరం చూశాం.

**గెలిస్తే మీరేం పనులు చేస్తారు?**

భువనగిరి లోక్‌సభ ప్రాంత అభివృద్ధి కోసం కేంద్రం మెడలు వంచైనా నిధులు తెస్తా. భువనగిరి, ఇబ్రహీంపట్నం, తుంగతుర్తి, నకిరేకల్ నియోజకవర్గాలకు ఐటీ కంపెనీలను తెస్తా. చిట్యాలలో డ్రైపోర్ట్ ఏర్పాటు కోసం కొట్లాడుతా. బీబీనగర్‌లో సీసీఎంబీ ఏర్పాటుకు, ఎయిమ్స్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తా. యాదగిరిగుట్ట పరిసరాల్లో ఆయుష్ యూనివర్సిటీ నెలకొల్పేందుకు కృషి చేస్తా. భక్తుల తాకిడి పెరుగుతున్నందున యాదగిరిగుట్ట వరకు మెట్రో రైల్‌ను తీసుకొస్తా. రాయగిరి వరకు ఎంఎంటీఎస్‌ను పొడిగిస్తా. ఇబ్రహీంపట్నానికీ మెట్రో రైలు వేయిస్తా. హైదరాబాద్-వరంగల్, హైదరాబాద్ -విజయవాడ జాతీయ రహదారులను ఆరులేన్లుగా విస్తరించేందుకు కృషి చేస్తా. భువనగిరి ఖిలాను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతా. భూదాన్‌పోచంపల్లికి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్స్ మంజూరు కోసం కేంద్రంతో కొట్లాడుతా.

**ఎన్నికల ప్రచారంలో ప్రజల స్పందన ఎలా ఉంది?**

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన వస్తున్నది. ప్రణాళిక ప్రకారం మండలాల వారీగా ప్రచారం నడుస్తున్నది. ఎక్కడికెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నరు. నా నిబద్ధత, మంచితనం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు నచ్చి నాకు టికెట్ కేటాయించారు. కేసీఆర్‌తోపాటు పార్టీ పెద్దలంతా నన్ను ఏకగ్రీవంగా ప్రతిపాదించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులందరూ నాకు సహకరిస్తున్నరు.



ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గౌతమ్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, బీఆర్ఎస్ నేతలు

## ఖమ్మంలో బీఆర్ఎస్ అభ్యర్థి నామా నామినేషన్

మామిళ్లగూడెం, ఏప్రిల్ 24: ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు బుధవారం జిల్లా కేంద్రంలో నామినేషన్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా ఆయన మూడు సెట్ల నామినేషన్ పత్రాలను సమర్పించారు. కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్‌కు తన నామినేషన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారధిరెడ్డి, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, మాజీ మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, మదన్‌లాల్, మెచ్చా నాగేశ్వరరావు, కందాళ ఉపేందర్‌రెడ్డి, తాటి వెంకటేశ్వర్లు, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, మేయర్ పునుకొల్లు నీరజ తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్లకు నేడే ఆఖరు

ఇప్పటివరకు 478మంది దాఖలు • నేడు కేంద్ర ఎన్నికల పరిశీలకుల రాక

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల గడువు గురువారం ముగియనుండగా మంగళవారం నాటికి మొత్తం 478 మంది అభ్యర్థులు పత్రాలు దాఖలు చేశారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికకు 13 మంది నామినేషన్లు దాఖలు చేశారు. మరోవైపు కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రానికి సాధారణ, శాంతి భద్రతల, ఎన్నికల వ్యయ పరిశీలకులను నియమించింది. వీరు గురువారం ఆయా నియోజకవర్గ కేంద్రాలకు చేరుకోనున్నారు. సాధారణ పరిశీలకులుగా ఐఏఎస్ అధికారులు, శాంతిభద్రతల పరిశీలకులుగా ఐపీఎస్ అధికారులు, వ్యయ పరిశీలకులుగా ఐఆర్ఎస్, ఐటీకి చెందిన అధికారులను నియమించారు. వీరు ఎన్నికలు పూర్తయ్యే వరకు నియోజకవర్గాల్లో అందుబాటులో ఉండి, రాజకీయ పార్టీల ఫిర్యాదులను సైతం స్వీకరిస్తారు.

### పోలింగ్ కేంద్రాలకు మే 12న సెలవు

రాష్ట్రంలో పోలింగ్ కేంద్రాలు, ఓట్ల లెక్కింపు కేంద్రాలు ఉన్న విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు మే 12న, జూన్ 4న సెలవుదినాలుగా ఎన్నికల సంఘం ప్రకటించింది. పోలింగ్ ఏర్పాట్ల కోసం ఆయా విద్యాసంస్థలు, ప్రైవేటు సంస్థలకు ముందు రోజు కూడా సెలవు ఇవ్వాలనే ఉద్దేశంతో మే 12న సెలవు ప్రకటిస్తున్నట్టు పేర్కొన్నది.

# ఇదీ కాంగ్రెస్ 'పవర్'!

- కరెంట్ కోతలపై మాజీ మంత్రుల వినూత్న నిరసన
- మీడియా సమావేశంలో కట్టెతో ఫ్యాన్ తిప్పిన నేతలు



మహబూబ్‌నగర్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతుండగా కరెంట్ పోయి ఎంతకూ రాకపోవడంతో కట్టెతో ఫ్యాన్‌ను తిప్పుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె, మాజీ ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంట్ ఉండదని ఎన్నికల ముందు బీఆర్ఎస్ నేతలు చెప్పిన మాటలు నేడు అడుగడుగునా నిజమవుతున్నాయి. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రులు, నేతలు ఏర్పాటుచేసిన సమావేశానికి కరెంటు కోత ఎదురై మరోసారి నిరూపితమైంది. మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, ఎంపీ, బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఏర్పాటుచేసిన మీడియా సమావేశం ప్రారంభమైన ఐదు నిమిషాలకే కరెంట్ సరఫరా నిలిచిపోయింది. సమావేశం ముగిసే వరకు విద్యుత్తు రాలేదు. దీంతో స్పందించిన వారంతా కట్టెలతో ఫ్యాన్‌ను తిప్పుతూ నిరసన తెలిపారు. 'ఇదీ కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు.. కరెంట్ కోసం తల్లడిల్లాల్సిన పరిస్థితి.' అంటూ ఎద్దేవా చేశారు. పాలమూరు జిల్లాలో ఉదయం నుంచే కరెంట్ కోతలు మొదలయ్యాయని విమర్శించారు. రాబోయే రోజుల్లో మంచినీటి కోసం బిందెలు పట్టుకొని మళ్లీ నిరీక్షించాల్సిన పరిస్థితి దాపురిస్తుందని వారు హెచ్చరించారు. జిల్లాలో సాగునీరు లేక కరెంట్ కోతలతో చేతికొచ్చిన పంటలు ఎండిపోగా, పట్టణాల్లోనూ మొదలైన కరెంట్ కోతలు ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు.

### కాంగ్రెస్, బీజేపీ ఒక్కటే..

కాంగ్రెస్, బీజేపీ ఒక్కటేననే విషయం గత అసెంబ్లీ ఎన్నికల్లోనే తేలిపోయిందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. గత ఎన్నికల్లో కమలం పార్టీ నేతలు హస్తం పార్టీకి మద్దతు పలికారని, లోక్‌సభ ఎన్నికల్లో కమలం పార్టీకి మద్దతిచ్చేందుకు కాంగ్రెస్ లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకున్నదని విమర్శించారు. ఈ విషయంపై ఆ రెండు పార్టీల నేతలు చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. ఎంపీ మన్నె మాట్లాడుతూ తనను మరోసారి ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపించాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందని, బీజేపీకి ఓటేస్తే ప్రయోజనమే ఉండదని పేర్కొన్నారు.

## కరెంటు కోతలు లేనే లేవు: ఉత్తమ్

మొదటిపేజీ తరువాయి...

నుంచి 12 వేలకు పెంచామని చెప్పడం అబద్ధమని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు మీద ఇప్పటికే రూ.95 వేల కోట్లు ఖర్చు చేశారని, దానిని పూర్తి చేయాలంటే రూ.1.5 లక్షల కోట్లు అవుతుందని తెలిపారు. నిరుడు అక్టోబర్ 21న మేడిగడ్డ కుంగిందని, ఆ తర్వాత నీటిని దిగువకు వదిలారని చెప్పారు. ఇప్పుడు నెపం తమ పై నెడుతున్నారని మండిపడ్డారు. కృష్ణా నదీజలాల విషయంలో 299 టీఎంసీలకు ఒప్పుకొని కేసీఆర్ దారుణంగా మోసం చేశారని ఆరోపించారు. దీంతో ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలకు నష్టం జరిగిందని తెలిపారు. నదీజలాల్లో వాటాపై తాము ఢిల్లీలో సమర్థంగా వాదిస్తున్నామని చెప్పారు. డిండి లిఫ్ట్ ఇరిగేషన్‌కు ఇప్పటివరకు నీటి కేటాయింపులు జరగలేదని, తాము కేటాయింపులు చేసి పూర్తి చేస్తామని చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్యేలు బీఎల్ఆర్, బాలునాయక్, జయవీర్‌రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌కు రెండు సీట్లొస్తే రాజీనామా: కోమటిరెడ్డి

లోక్‌సభ ఎన్నికల్లో రెండు స్థానాల్లో బీఆర్ఎస్ గెలిస్తే తాను మంత్రి పదవికి రాజీనామా చేస్తానని రోడ్లు,భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సవాల్ విసిరారు. నల్లగొండలో జరిగిన కాంగ్రెస్ సభలో,మంత్రి ఉత్తమ్‌తో కలిసి హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 8 నుంచి 10 స్థానాల్లో బీఆర్ఎస్ గెలుపొందుతుందని టీవీ చానల్ ఇంటర్వ్యూలో చెప్పిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యాఖ్యలకు ఆయన స్పందించారు. కనీసం రెండు గెలిస్తే తాను రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు.

## ఓటుతోనే కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

మాచారెడ్డి, ఏప్రిల్ 24: వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని మోసగించిన కాంగ్రెస్ పార్టీకి ఓటుతో బుద్ధి చెప్పాలని మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ జహీరాబాద్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌తో కలిసి కామారెడ్డి జిల్లా మాచారెడ్డి, కామారెడ్డి మండలాల్లో పోచారం బుధవారం రోడ్‌షో నిర్వహించి మాట్లాడారు. పంద్రాగస్టు లోపు రుణమాఫీ చేస్తామంటున్న సీఎం.. ఇప్పటికీ రైతుబంధు పూర్తిగా ఇవ్వలేదని విమర్శించారు. ప్రజల బతుకులు మార్చే కేసీఆర్ నాయకత్వానికి మద్దతు తెలుపుతూ బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 'పాంచ్ న్యాయ్' పేరుతో ప్రజలకు పంగనామాలు పెట్టేందుకు యత్నిస్తున్నదని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పేర్కొన్నారు.

## హామీలు అమలు చేసేదాకా వెంటాడుతం

- మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్, ఏప్రిల్ 24: అనుచిత హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ హామీలు అమలు చేసేదాకా వెంటాడుతామని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీ అబద్ధాలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నాయని, వచ్చే ఎన్నికల్లో ఆ రెండు పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం సుంకెట్, దోన్‌పాల్ గ్రామాల్లో బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ప్రశాంత్‌రెడ్డి మాట్లాడారు. ఉపాధి పనులు జరుగుతున్న ప్రాంతానికి వెళ్లి బీఆర్ఎస్‌కు ఓట్లేయాలని కూలీలను అభ్యర్థించారు. ఆరు గ్యారెంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామన్న కాంగ్రెస్.. 120 రోజులు దాటినా అమలు చేయడం లేదన్నారు. ఇప్పుడేమో పంద్రాగస్టు లోపు రుణమాఫీ చేస్తామంటున్నారని విమర్శించారు. ఐదు రోజుల్లో పసుపుబోర్డు తెస్తానన్న బీజేపీ ఎంపీ అర్వింద్ రైతులను మోసం చేశారన్నారు. రైతులను, ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్, బీజేపీలకు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని కోరారు.

# ఎట్టకేలకు కాంగ్రెస్ అభ్యర్థులు ఖరారు

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ చివరి దాకా పెండింగ్‌లో పెట్టిన ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల అభ్యర్థులను ఎట్టకేలకు బుధవారం సాయంత్రం ప్రకటించింది. ఖమ్మం అభ్యర్థిగా రామసహాయం రఘురామిరెడ్డి, కరీంనగర్ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్‌రావు, హైదరాబాద్ అభ్యర్థిగా సమీర్ వలీలుల్లా పేర్లను అధికారికంగా ప్రకటిస్తూ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటన విడుదల చేశారు. వీటితోపాటు త్వరలో ఉప ఎన్నికలు జరగనున్న వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్నను ఖరారు చేసినట్టు ఈ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీ అభ్యర్థులుగా ఎంపికైన ఆ ముగ్గురూ ఇప్పటికే తమ నామినేషన్లను దాఖలు చేశారు. కాగా కరీంనగర్ టికెట్ ఆశించిన మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి కూడా బుధవారం తన నామినేషన్ దాఖలు చేయడం ఆ పార్టీ వర్గాల్లో ఉత్కంఠ రేపుతున్నది. వెలిచాల రాజేందర్‌రావుకు పార్టీ టికెట్ కేటాయించిన నేపథ్యంలో ప్రవీణ్‌రెడ్డి నామినేషన్ ఉపసంహరించుకుంటారా? తిరుగుబాటు అభ్యర్థిగా బరిలో నిలుస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఖమ్మం టికెట్ కోసం చివరి వరకు గట్టిగా ప్రయత్నించిన డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క సతీమణి నందిని కూడా గురువారం నామినేషన్ దాఖలు చేస్తారంటూ సోషల్ మీడియాలో పోస్టర్లు చక్కర్లు కొట్టడం ఆసక్తికరంగా మారింది. 'మన నందినమ్మకు తోడుగా ఖమ్మం పార్లమెంట్ ప్రజలు' పేరుతో వెలువడిన ఈ పోస్టర్లలో భట్టి విక్రమార్క ఫొటో తప్ప, పార్టీ నాయకుల ఫొటోలు లేకపోవడంతో ఇది ఫేక్ పోస్టర్ అయి ఉండవచ్చని పార్టీ వర్గాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. భట్టి విక్రమార్క ప్రస్తుతం పార్టీ అభ్యర్థుల తరఫున కేరళలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. రెండు రోజుల క్రితం భట్టి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇద్దరూ కలిసి బెంగళూరు వెళ్లి పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో భేటీ అయ్యారు. అక్కడే ఖమ్మం అభ్యర్థిగా రఘురామిరెడ్డి పేరు ఖరారు అయినట్టు పార్టీ వర్గాల సమాచారం. ఆ తర్వాతనే ఆయన కేరళలో పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారానికి వెళ్లినట్టు భట్టి సన్నిహిత వర్గాల సమాచారం. కాగా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న నందిని నామినేషన్ పోస్టర్లపై ఆ పార్టీ నేతలు ఎవరూ స్పందించక పోవడం చర్చనీయాంశంగా మారింది.

# 'తులం బంగారం' పెద్ద మోసం

- బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ విమర్శ



చిగురుమామిడిలో మాట్లాడుతున్న కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్, పక్కన మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

చిగురుమామిడి, ఏప్రిల్ 24: కాంగ్రెస్ పార్టీ ఆడబిడ్డల పెండ్లీలకు రూ.లక్షతోపాటు తులం బంగారం ఇస్తామన్న హామీ పెద్ద మోసమని బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బీ వినోద్‌కుమార్ మండిపడ్డారు. బుధవారం ఆయన కరీంనగర్ జిల్లా చిగురుమామిడి, సైదాపూర్‌లో హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌తో కలిసి రోడ్‌షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓట్ల కోసం సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్లుపెట్టే నాటకం ఆడుతున్నారని విమర్శించారు. కరీంనగర్ ప్రస్తుత ఎంపీ బండి సంజయ్ ఐదేండ్లలో నియోజకవర్గానికి చేసిందేమీలేదని విమర్శించారు. ప్రజలు ఆలోచించి కారు గుర్తుకు ఓటేసి తనను పార్లమెంట్‌కు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## మా గ్రామానికి రోడ్డు వేస్తేనే.. ఓటేస్తాం

కోటపల్లి, ఏప్రిల్ 24: మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం రాజారాం గ్రామపంచాయతీకి రోడ్డు వేస్తేనే ఓటు వేస్తామని గ్రామస్థులు స్పష్టం చేశారు. కోటపల్లి మండలంలో రాజారం, కావరకొత్తపల్లి గ్రామాలకు రోడ్డు లేదు. అందుకు నిరసనగా ఈ పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరిస్తూ గ్రామస్థులు తీర్మానం చేశారు. స్పందించిన అధికారులు గ్రామస్థులతో బుధవారం సమావేశమయ్యారు. ఎంపీడీవో ఆకుల భూమయ్య, ఎస్సై రాజేందర్, డిప్యూటీ తహసీల్దార్ నవీన్ గ్రామస్థులతో సమావేశమై మాట్లాడారు. తమ గ్రామానికి రోడ్డు లేకపోవడం ప్రధాన సమస్య అని, రోడ్డు నిర్మిస్తేనే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పాల్గొంటామని గ్రామస్థులు స్పష్టంచేశారు. రోడ్డు నిర్మాణం అయితేనే ఓట్లు వేస్తామని తేల్చిచెప్పారు.